# కలియుగ కృష్ణార్జునులు

**"రా, బామ్మర్దీ, రా. ఏటి శానా దిగులుగా ఉన్నావు. ఇదిగో ఓ సుక్కేసుకో," అని చాముండేశ్వర రావుగారు బావమరిది సంపత్‌కి గ్లాసులో బుడ్డీ వంచి గ్లాసు అందించారు.**

"మద్య నిశేధం కదా..." అంటూ గ్లాసు అందుకున్నాడు సంపత్.

"నీ శార్దం. అది మనకి ఒర్తించదు, బామ్మర్దీ ! నేకపోతే సారా తాగి పోలీసుల సేత తన్నులు తినే సగటు మణిసికి, మనలాంటి రాజకీయ నాయకుడికీ తేడా ఏటి? అది సరేకాని నీ ప్రాబ్లమ్ ఏటి?"

"ఏం లేదు బావా ! మా ఆఫీసులో ఇదివరకు వేకెన్సీలు వస్తే సిఫారసు తీసుకొచ్చిన కొంతమందికి



— పులిగడ్డ విశ్వనాథరావు

ఉద్యోగాలు వేయించా. ఈసారి కూడా వేకెన్సీలు వచ్చాయి. మావాడికి ఉద్యోగం ఇప్పించు అంటే మావాడికి ఇప్పించు అని అందరూ సిఫారసులు ఐతే చేస్తారు కాని పని అయాక నాకు ఒక తృణం కూడా అందజేయరు."

చాముండేశ్వరరావుగారు ఓ వేదాంతపు నవ్వు నవ్వి, పార్థుడికి వాసుదేవుడు గీతోపదేశం చేస్తున్న ఫోజులో ఇలా అన్నారు. "ఇది నీలో లోపం, బామ్మర్దీ! నీకు డబ్బు రాబట్టుకునే మారగం తెలీదు. ఇదిగో నీకు ఆ మారగం సెప్తా, యినుకో."

"చెప్పు బావా! నీకు పుణ్యం ఉంటుంది."

"నువ్వు ఎంత సదువు సదువుకున్నా, బడి మొహం ఎరగని నా సరణే రావాల."

"ఔను. మరి నువ్వు లోకం అనే యూనివర్సిటీలో వ్యవహార జ్ఞానంలో డాక్టరేట్ పొందావు కదా?"

"సరిగ్గా సెప్పినావు. ఐతే నీకు సీతాపతి కత సెప్తా యిను. దాని ఒలన మన గౌరవం కాపాడుకుంటూ అవతల మణిసికాడ డబ్బు ఎట్టాగ రాబట్టు కోవాలో నీకు తెలుస్తది."

"సీతాపతి నా సుట్టు తిరిగే సెటిలైటు. ఆడికి దండిగా డబ్బుంది. ఆడికి రాజకీయ పలుకుబడి సంపాయించాలన్న తహతహ ఉందని పసికట్టినా. సరే, దీన్ని మనం కాష్ సేసుకోవచ్చని ఆలోచించినా".

"ఆడు ఓ రోజు బార్యాసమేతంగా నాకాడకొచ్చి, తవరు రేపు సతీసమేతంగా మా ఇంటికి రావాల. రేపు మా మారెజి ఎనివర్సరీ. సిన్న డిన్నరు పార్టీ యేర్పాటు సేసినా. తవరే చీఫ్ గెస్టు" అన్నాడు. తప్పక ఒస్తాం అనినా.

"డిన్నర్ పార్టీ దిగ్గిజయంగా సాగినాది. అసలు ఆ పార్టీ నన్ను ఆహ్వానించి, గౌరవించే సదవకాసం కల్పించు కోడానికి ఏర్పాటు సేసినట్టుంది. అసలు ఆడికి మారెజి ఎనివర్సరీ సేసుకునే అలవాటే నేదని నాకు రహస్యంగా తెల్పినాది. ఆడి మారేజి జరిగింది మండు వేసంగిలోనట. ఇప్పుడు గజగజ ఒణికించే సలికాలం.

"నాకు, మీ అక్క జోగులుకి కారులోంచి దిగగానే సీతాపతి, బార్య ఎదురొచ్చి దండలు యేసినారు. పండితులు ఏదపటనం సేసి స్వాగతం పలికినారు. సీతాపతి తన యివావ వార్సికోత్సవంలా కాక అసలు యివావం మాదిరిగానే ఏర్పాట్లు సేసినాడు. బాజా బజంత్రీలు, రంగురంగుల దీపాలు, అన్ని హంగులు ఉన్నయి.

"సీతాపతి బార్య ఒంటినిండా నగలతో లచ్మీదేవి యిగ్రహంలా మెరిసిపోతున్నాది. ఆమె, 'మా ఆయనకి నగలంటే నాకంటె ఎక్కువ పిచ్చి. పెతినెలా ఏదో నగ సేయిత్తు ఉంటారు,' అని మీ అక్కతో అంది. 'సీతాపతి, నువ్వు నగల ఎక్స్‌పర్ట్‌లా ఉన్నావే,' అని ఓ కామెంటు పారేసినా. సీతాపతి ఒప్పుకున్నట్టు నవ్వేసినాడు.

"సీతాపతి పార్టీ నుంచి ఒచ్చినాక నాకు ఒక ఐడియా తట్టినాది. ఆ ఐడియాని అమలు ఎట్టడానికి ఆఫీసు నుంచి ఆడికి ఫోను సేసినా. 'ఏంవోయ్, సీతాపతి. నాకోసిన్న సాయం కావాల,' అన్నా. 'సెలవివ్వండి, సార్,' అన్నాడు. 'మా అమ్మాయి పెబ జాజి మొగ్గల నెక్లెస్ కొనమని ఒకటే గోల ఎడుతోంది. నీకు ఈ నగల యవ్వారం బాగా తెలుసు కదా. నువ్వోసారి మా ఆవిడిని, మా అమ్మాయిని బజారుకి తీసుకెల్లి సక్కటి నెక్లస్ కొనిపించవోయ్. యిలా ఇబ్బంది ఎడుతున్నందుకు ఏవీ అనుకోవు కదా ?" అనినా. 'ఎంతమాట, సార్. మీ అమ్మాయి అంటే నాకు సెల్లెలే కదా. సెల్లెల కోసం నెకలెస్ కొనడంలో సాయం సేయడం నా విది కదా ?' అని బదులు సెప్పినాడు.

"అది సరేకాని ఒక యిసయం సెప్పదలిచినా. నువ్వు ఒక్క పైసా కర్సు ఎట్టకూడదు. ఒకయేల ఎట్టినావో నాకు నీకూ తెగతెంపులే." సీతాపతి జవాబు సెప్పకుండా నవ్వి ఊరుకున్నాడు.


"ఎంటనే సీతాపతి కారులో మనింటికి బైలుదేరినాడు. నాను ఆఫీసులోనే ఉన్నా. జోగులు, పెబా రెడీగా ఉన్నారు. సీతాపతి మీ అక్కతో ఒరస కల్పుకుని, 'పిన్నిగారు, బాగున్నారా? ఏవమ్మా సెల్లీ, బాగున్నావా ? అచ్చంగా మాదురీ దీచ్చిత్‌లా ఉన్నావు సుమీ" అని ఇద్దరినీ పలకరించినాడు.


"సీతాపతి పాలకొండ శివయ్య అండ్ సన్స్, జివెలర్స్ దుకాణంలో తన కుటుంబంలో ఆడోళ్ళకి నగలు సేయిస్తూ ఉంటాడు. ఇద్దరినీ ఆడకే తీసుకెళ్ళినాడు. శివయ్య సాయంగా ఒచ్చి ముగ్గురునీ దుకాణంలోకి ఆవ్వానించినాడు. మూడు కూల్‌డ్రింక్స్ తెప్పించి ముగ్గురికీ అందించినాడు. తర్వాత ఎన్నో హారాలు సూపించినాడు. మీ అక్క జోగులు జాజి మొగ్గల నెక్లెస్ ఎంచినాది. కాని పెబ యిప్పుడు మామిడి పెందెల నెక్లెస్ మీద మోజు కనబర్చినాది.

"అదేటే, ముందు జాజి మొగ్గలు కావాలని పేణం తీసినావు కదటే. తీరా యీడకి ఒచ్చినాక మామిడి పిందెలు నచ్చినాయంటావేటి? నీ యవ్వారం సిత్రంగా ఉందే ! జాజి మొగ్గలే బాగుంటాయే. సూడు, ఎంత సక్కగా ఉందో," అని సెప్పి శివయ్యని దాని దర అడిగినాది జోగులు. 18 వేల రూపాయిలని సెప్పినాడు శివయ్య. పెబ నాభంనేదని మొగం ముడుసుకుని కూకుంది.

"జోగులు పర్సులోంచి డబ్బుతీసి లెక్కెడుతోంది. సీతాపతి దాన్ని ఆపి, 'మీరుండండి పిన్నిగారూ. నానుండగా మీరు డబ్బు ఎందుకు ఇయ్యడం?' అని తన పర్సుతీసి నోట్లు కట్ట తీసినాడు. "యీలునేదు. మీ బాబాయికి తెలిస్తే ఇంకేమైనా ఉందా?' అన్నది జోగులు. 'ఆ యిసయం నాను సూసుకుంటాను లెండి.' అని డబ్బు సెల్లించబోయాడు. జోగులు యీలు నేదని పట్టుబట్టినాది. కాని సివరకు సీతాపతే డబ్బు సెల్లించినాడు.

"ముగ్గురు బైటకు ఒచ్చి కారులో కూకున్నారు. సీతాపతి ఏదో మర్సినట్టు, 'మీ కోడలు ఏవోజుంకాలు






పురమాయించమంది పిన్నిగారు. పురమాయించి ఐదు నిమిషాల్లో ఒచ్చేత్తాను,' అని సీతాపతి మళ్ళా శివయ్య షాప్‌లోకి పెవేసించినాడు. ఐదు నిమిషాల్లో బైటికొచ్చి కారులో కూకున్నాడు. ముగ్గురు మనింటికి తిరిగి ఒచ్చినారు.

జోగులు ఇంటి లోపలికి ఎళుతూ, 'బాబు ! కాఫీ తీసుకెల్లు. ఈలోగా మీ బాబాయి కూడా ఒచ్చేత్తారు,' అన్నది. సీతాపతి డ్రాయింగ్ రూమ్‌లో సోఫాలో కూకుని, 'సెల్లి, పెబా ఇట్రారా,' అని పెబని పిల్చినాడు. పెబ ఆడి ముందొచ్చి నిలబడినాది. 'ఏటి, అన్నయ్యా?' అని అడిగినాది.

'ఆ నెక్లెస్ పిన్ని చాయిస్. ఇదిగో నీ చాయిస్. నా ముద్దు సెల్లెలికి నా కానుక,' అని అనినాడు నెక్లెస్ కేస్ పెబకి అందిస్తూ. పెబ కేస్ తెరిసి నెక్లెస్ సూసింది. ముద్దులు మూటకట్టే ఆ మామిడి పిందెల నెక్లెస్‌ని సూసి ఆమె కళ్ళు సంతోసంతో మెరిసాయి. 'నాన్నగారు, ఏవంటారో, అన్నయ్యా,' అన్నది పెబ. 'నువ్వు బయపడకు,సెల్లీ. ఆ యెవ్వారం నాను సూసుకుంటాలే,' అని సీతాపతి బదులు సెప్పినాడు.

"పెబ నెక్లెస్ బట్టుకుని ఇంట్లోకి యెల్లిపోనాది. కాస్త టైమయాక కాఫీతో సహా జోగులు డ్రాయింగు రూమ్‌లోకి ఒచ్చినాది. 'అదేటి, బాబు, యీ అగాయిత్తెం. మీ బాబాయి మండి పడతారు, తెలుసా. అవ్వవ్వ. జాజి మొగ్గలు సాలదూ. మామిడి పిందెలు కూడానా. దాని మోజు కూలా,' అని అన్నది జోగులు సీతాపతికి కాఫీ అందిస్తూ.

"కాఫీ అందుకుని సీతాపతి, 'మీరు ఊరుకోండి, పిన్నిగారు. నాను కొనినానని బాబాయికి నానే సెబుతా. కొడతారు, అంతేగా. కొట్టినా, బుజ్జగించినా పడడానికి నాను సిద్దమేగా,' అని అనినాడు సీతాపతి.

"ఇంతలో నాను ఊడిపడినా. సీతాపతిని పలకరించి, 'జోగులు ! నెక్లెస్ కొనినావా?' అని జోగుల్ని అడిగినా. 'ఆ, ఇదిగో అని జాజి మొగ్గల నెక్లెస్ సూపెట్టినాది. 'ఎంతయినాది?' అని అడిగినా. '18 వేల రూపాయిలు. కాని '...' అని ఊరుకుంది. 'కాని ఏటి, జోగులు ?' అని అడిగినా. 'నాను సెప్తా, సార్. నానుండగా పిన్నిగారు డబ్బు సెల్లించడం ఏటని...' 'ఐతే నువ్వే సెల్లించినావా? ఎంత గోరం ! నీకు సెప్పినానా నువ్వు ఒక్క పైసా కూడా కర్చు సేయడానికి యీలు నేదని.' అని అరిసా.

"అంతే కాదండి. పెబ ఈ మామిడి పిందెల నెక్లెస్‌ని సూసి మోజు పడినాదని సీతాపతి దీన్ని కూడా కొని దానికి గిఫ్ట్‌గా ఇచ్చినాడండి,' అన్నది. మామిడి పిందెల నెక్లెస్ కూడా నాకు చూపెడుతూ. 'సహ్వా ! పెబ నాకు తగ్గ కూతురే. సీతాపతిని బుట్టలో యేసుకొని మరో నెక్లెస్ కూడా కొట్టేసినాది,' అని లోలోన సంబరపడి పోయా. బైటికి మాత్తరం మండిపడుతూ, 'ఏటీ అన్నేయం, సీతాపతి. ఇది సబబేనా? ఔనులే, నాదే తప్పు నీకు సెప్పడం. బుద్ది గడ్డి తిని అలా సేసినాను. ఏటి నాను లంచాలు తినే బాపతు అనుకున్నావేటి?' అనినా.

"ఎంతమాట అనినారు, సార్. నా సెల్లెలకి నా యిట్టం ఒచ్చిన నగలు కొని ఎట్టుకుంటాను. మద్దెన మీరెవరు? లంచంట లంచం. నాకు అప్ప సెల్లెళ్ల నేరు. కాబట్టి మీ అమ్మాయినే సెల్లెలుగా సూసుకుంటున్నా. ఆమె నన్ను అన్నయ్యా అని పిలుత్తూంటే, ఆహా ఇంత కాలానికి నాకు అలా పిలిపించుకునే అదృట్టం కలిగినాది కదా అని నాను పొంగిపోతున్నా. మీరేం అనండి సార్, నన్ను కొట్టండి, తిట్టండి. ఈ సంబంధం మాత్తరం తెగదు. యిప్పటికి ఎల్లి ఒత్తా. మీ కోపం సల్లారేక మళ్లా కల్సుకుంటా, సెలవు,'' అని సెప్పి సీతాపతి ఎల్లిపోనాడు.

"సీతాపతి ఎల్లిపోయాక మీ అక్కతో నాను నవ్వుతూ ఇలా అనినా. మొత్తంమీద 40 వేల రూపాయిలు కిట్టుబాటు అయినట్టే. సీతాపతి బంగారం గుడ్లు ఎట్టే బాతు. ఆడిని సేయి జారిపోకుండా సూత్తూ ఉండాల మనం.''

"ఇప్పుడు తెల్సింది బావా. తైలంలోచి ఇసక ఎలా... పిండాలో...''

"నీకు కిక్ తలకెక్కినట్టుంది ... ఎల్లు, బామ్మర్ది. మల్లా కల్సుకుందా,'' అన్నారు చాముండేశ్వరరావుగారు కొత్త బుడ్డీ మూత తీస్తూ.

బాలీవుడ్ బాణీ



## పెళ్లీ లేదు... గిళ్లీ లేదు

బోనీ కపూర్‌తో శ్రీదేవి పెళ్లి హైదరాబాద్‌లో రహస్యంగా జరిగిందనే వార్తలు ఇటీవల వచ్చాయి. అయితే ఈ వార్త నిజం కాదనీ, కేవలం పుకారు మాత్రమేననీ 'ఆర్మీ' షూటింగ్‌లో కలిసినపుడు శ్రీదేవి కాస్త ఆవేదనతోనే చెప్పింది. ప్రజల విశ్వాసాన్ని చూరగొన్న జాతీయ దినపత్రికలు ఇటువంటి వార్త ప్రచురించడం తనకు చాలా బాధ కలిగించిందని, 'ఆంధ్రప్రభ' ద్వారా తాను ఈ వివరణ ఇస్తున్నదనీ ఆమె స్పష్టం చేసింది. తాను తన బోనీ కేవలం స్నేహితులం మాత్రమేననీ, అంతకు మించి మరేదీ తమ మధ్య లేదనీ ఆమె చెప్పింది. కాబట్టి మరోసారి ఈ వార్తను తాత్కాలికంగా మనం నమ్మనక్కరలేదు కదూ?

- మసూద్ అన్సారీ